నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 12 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

## మున్నూరుకాపు సంఘ భవనంలో పూజలు


మున్నూరుకాపు సంఘ భవనంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 11 : ఆదిలాబాద్ పట్టణంలోని మున్నూరుకాపు సంఘ భవనం, ఎలక్ట్రానిక్ మీడియా గణేశ్ మండల్ వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కాళ్ల విఠల్ పాల్గొన్నారు.

## అడవులను కాపాడడం మన బాధ్యత

### డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్


నివాళులు అర్పిస్తున్న డీఎఫ్‌వో, శిక్షణ కలెక్టర్, ఎఫ్ఆర్వో

ఎదులాపురం, సెప్టెంబర్ 11 : అడవులను కాపాడడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మావలలోని హరిత వనంలో జిల్లాకు చెందిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి అత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్, రాష్ట్ర అటవీ సంఘం నాయకులు బాణవత్ ప్రశాంత్, నరేశ్, కృష్ణ, ప్రవీణ్, అమర్‌సింగ్ పాల్గొన్నారు.


లక్షెట్టిపేట పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

ఉట్నూర్, సెప్టెంబర్ 11 : ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులకు సూచించారు. లక్సెటిపేట, యెందా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఆదేశించారు. ఏమైనా మరమ్మతులు ఉంటే తమకి తెలియజేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా నీటి నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

## డీ అడిక్షన్ కేంద్రాలు మేలు చేస్తాయి

- మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి..
- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్


నిర్మల్ ఆసుపత్రిలో డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 11 : మద్యం, మత్తు పదార్థాలకు బానిసైన వారికి డీ అడిక్షన్ కేంద్రాలు ఉపయోగపడతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో బుధవారం డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల బారినపడ్డ వారు ఈ అలవాట్లను మాన్పించేందుకు కేంద్రాలు ఉపయోగపడుతాయన్నారు. నిర్మల్ దవాఖానలో కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరు పడకలతో అన్ని రకాల వసతులతో ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో మానసిక వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది ఉంటారన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని ఈ కేంద్రానికి తీసుకురావాలన్నారు. వారికి వైద్య నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చి వారి అలవాట్లను మాన్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆసుపత్రిలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి రాజేందర్, సూపరింటెండెంట్ సునీల్, డీసీహెచ్‌ఎస్ సురేశ్, కార్యక్రమ అధికారి శ్రీనివాస్, ఆర్ఎంవో సమత, మానసిక వైద్య నిపుణులు సురేశ్, అరుణ్, వైస్ ప్రిన్సిపాల్ దరహాస, నర్సింగ్ సూపరింటెండెంట్లు కమలమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 11 : బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఉపకులపతి, అధ్యాపకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కళాశాలలో పరిపాలన, మౌలిక సదుపాయాలు, ఉద్యోగాల కల్ప న వంటి విషయాలలో పురోగతిని సాధించినట్లు తెలిపారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పలు ప్రైవేటు కంపెనీలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు భారీ సంఖ్యలో కొలువులు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాలు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఉప కులపతి ప్రొఫెసర్ వెంకటరమణ, పరిపాలన విభాగపు అధికారి రణదీర్‌సాగి, అసోసియేటెడ్ డీన్స్ మహేష్, పావని ఉన్నారు.


ట్రిపుల్ ఐటీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

# నాడు ఉచితం.. నేడు కొనుగోలు

### ఈ యేడాది వానకాలం ముగుస్తున్నా పంపిణీ కాని చేపపిల్లలు

- సొంత డబ్బులతో కొని నీటి వనరుల్లో వదులుతున్న మత్స్యకారులు
- ఈనెల చివరివారం నుంచి వదులు తామంటున్న అధికారులు


నిండుకుండను తలపిస్తున్న మత్తడివాగు


మత్తడివాగు ప్రాజెక్టు వద్ద చేపతో మత్స్యకారుడు (ఫైల్)

ఆదిలాబాద్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం నీలి విప్లవంలో భాగంగా మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసింది. యేటా వానకాలానికి ముందుగానే చెరువులు, ప్రాజెక్టుల్లో చేప పిల్లలను వదిలి మత్స్యకారులకు ఉపాధి కల్పించింది. చేపలు పట్టడానికి వలలు, ఇతర సామగ్రి, మార్కెటింగ్ కోసం ఫోర్, టూ వీల్లర్ వాహనాలను పంపిణీ చేసింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అందించిన సహకారంతో మత్స్యకారుల ఉపాధి మెరుగుపడింది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 95 మత్స్య సహకార సంఘాల్లోని 4,500 మంది సభ్యులకు ఉపాధి లభించింది. గతేడాది కేసీఆర్ ప్రభుత్వం 224 సాగునీటి వనరుల్లో 1.18 కోట్ల చేప పిల్లలను మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేసింది. కట్ల, రాహు, బంగారు తీగ, మృగాల వంటి చేప పిల్లలను చెరువుల్లో పెంచడానికి 35 ఎంఎం నుంచి 45 ఎంఎం సైజు గల చేపపిల్లలను పంపిణీ చేశారు. స్థానికంగా విక్రయాలు జరపడంతో పాటు మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి చేపలను కొనుగోలు చేశారు.

### సీజన్ ముగుస్తున్నా ప్రారంభంకాని పంపిణీ

కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులకు చేపపిల్లల పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. వానకాలానికి ముందుగానే టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి. వర్షాలతో చెరువులు నిండిన వెంటనే చేపపిల్లల పంపిణీ చేయాలి. మత్స్యశాఖ అధికారులు జిల్లాలో ఈ ఏడాది 240 సాగు నీటి వనరుల్లో 1.23 కోట్ల చేప పిల్లల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో ఆదేశాలు ఇవ్వడంలో జాప్యం చేసింది. ఫలితంగా వర్షకాలం ముగుస్తున్నా పంపిణీ ప్రారంభం కాలేదు. గతంలో యేటా ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పుడు టెండర్ దశలోనే ఉండటంపై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది మత్స్యకారులు సొంత డబ్బులతోనే చేప పిల్లలను కొనుగోలు చేసుకుని పెంచుకుంటున్నారు.

### ఈనెల చివరి వారంలో ప్రారంభిస్తాం..

**- సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి**

ఇటీవలే టెండర్ ప్రక్రియను పూర్తి చేశాం. సాత్నాల, మత్తడి ప్రాజెక్టులతోపాటు ఎనిమిది పెద్ద చెరువుల్లో 80–100 ఎం ఎం సైజు, మిగిత చెరువుల్లో 35–45 ఎంఎం సైజు గల చేప పిల్లలను వదలడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల చివరివారం నుంచి జిల్లాల్లోని సాగునీటి వనరుల్లో చేపపిల్లల పంపిణీని ప్రారంభిస్తాం.

### రూ.80 వేలతో కొనుగోలు చేశాం..



*గతంలో వర్షాలు పడి చెరువులు నిండిన వెంటనే కేసీఆర్ ప్రభుత్వం చేపపిల్లలను పంపిణీ చేసింది. రాహు, బొచ్చ, శిలావతి, రొయ్య పిల్లలను ఉచితంగా అందిం చింది. ఈ ఏడాది చెరువులు నిండినా, సీజన్ ముగుస్తున్నా ప్రభుత్వం చేప పిల్లల ను పంపిణీ చేయలేదు. గతంలో మాదిరి చేప పిల్లలను అందించాలని మత్స్యశాఖ అధికారులను అడిగితే రాలేదు, వస్తాయని సమాధానం ఇస్తున్నారు. ఏటా జూలైలో చేపపిల్లలను చెరువుల్లో వేస్తే ఎండాకాలం వరకు బాగా పెరుగుతాయి. దీంతో మంచి లాభం వస్తుంది. మా సంఘంలో 13 మంది సభ్యులం ఉన్నాం. సీజన్ అయిపోతున్నందున అందరం కలిసి రూ.80 వేలు జమ చేసుకుని చేప పిల్లలు కొనుగోలు చేసి చెరువులో వేశాం. సమయం అయిపోతున్నందున ప్రభుత్వం ఇస్తుందా? లేదా? తెలియదు. ఉపాధి నష్టపోకుండా సొంత డబ్బులతో చేప పిల్లలను కొనుగోలు చేశాం.*

**- గుమ్ముల రమేశ్, మత్స్యకారుడు, పొన్నారి, తాంసి మండలం**

# నిర్మల్‌లో పంపిణీ లేనట్లేనా..?

- ఇప్పటికీ చెరువుల్లో చేప పిల్లలను వదలని యంత్రాంగం
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉచితంగా చేపపిల్లల పంపిణీ..

నిర్మల్, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో 548 చెరువులతోపాటు కడెం, స్వర్ణ, ఎస్సారెస్పీ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల్లో ప్రభుత్వం మత్స్యశాఖ యేటా చేప పిల్లలను వదులుతూ ఉంటుంది. 240 మత్స్య సహకార సొసైటీల ద్వారా 13,300 మంది సభ్యులు చేపపిల్లల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈసారి 4.15 కోట్ల చేప పిల్లలను జలాశయాల్లో వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే రెండు సార్లు టెండర్లను పిలిచినప్పటికీ చేప పిల్లలను సరఫరా చేసే వ్యాపారులు ముందుకు రావడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వంలో పకడ్బందీ ప్రణాళికతో నిర్విఘ్నంగా సాగిన చేపపిల్లల పంపిణీతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగారు. పెంచిన చేపలను మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు అవసరమైన వాహనాలు, వలలను సబ్సిడీపై అందజేసి గత ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలిచింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీ ఊసెత్తక పోవడంతో మత్స్యకారులు మండిపడుతున్నారు.

### ఉపాధిపై అనుమానాలు

ఈ యేడాది మత్స్యకారులకు పూర్తిస్థాయిలో ఉపాధి దక్కడం అనుమానమేనంటున్నారు. ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీ విధివిధానాలు ఖరారు కాకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయితే చేప పిల్లలను దూర ప్రాంతాల నుండి జిల్లాకు రవాణా చేసి ఉండేవారని చెబుతున్నారు. ఇటీవలే మూడో సారి నిర్వహించిన టెండర్ ప్రక్రియలో కొంత మంది కాంట్రాక్టర్లు చేప పిల్లల పంపిణీకి ముందుకొచ్చినప్పటికీ ఎప్పటిలోగా జలాశయాల్లో వదులుతారనేదానిపై స్పష్టత లేదంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రిజర్వాయర్లు, చెరువుల్లోకి నీరు వచ్చి చేరినందున ఇప్పటికే ప్రక్రియ మొదలైతే గడువులోగా చేప పిల్లలు చేతికి వచ్చేవని పేర్కొంటున్నారు. అయితే ఈసారి చేప పిల్లలు మరింత ఆలస్యంగా వదిలే అవకాశం ఉన్నందున వాటి పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపనున్నది. ఇదే జరిగితే మత్స్యకారుల ఉపాధి ప్రశ్నార్థకం కానున్నదని అంటున్నారు.


నిర్మల్‌లోని మార్కెట్‌లో చేపలను విక్రయిస్తున్న గంగపుత్రులు

### ఈ నెలాఖరు వరకు పంపిణీ చేస్తాం



చెరువులు, ప్రాజెక్టుల్లో చేప పిల్లలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు నిర్వహించినప్పటికీ వ్యాపారులు ఎవరూ టెండర్‌లో పాల్గొనలేదు. దీంతో గత ఆగస్టులో మరో సారి టెండర్లను నిర్వహించగా, నలుగురు కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. వారితో ఒప్పందం పూర్తయిన తర్వాత అన్ని రకాల చేప పిల్లలను ఆర్డర్ ఇస్తాం. ఈ నెలాఖరు వరకు చేప పిల్లలను వదిలేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నది.

**- కిరణ్‌కర్, మత్స్యశాఖ జిల్లా అధికారి, నిర్మల్.**

### కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



మత్స్యకారుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా ఇంత వరకు ఉచిత చేప పిల్లల పంపిణీ జరగలేదు. మత్స్యకార శాఖకు ఇంత వరకు మంత్రి కూడా లేదు. తమకు రావాల్సిన సబ్సిడీలు, ఇతర బెనిఫిట్స్ ఏవి కూడా రావడం లేదు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా గంగపుత్రులను ఇంతగా నిర్లక్ష్యం చేయలేదు. గత ప్రభుత్వంలో చేపల సీడ్ కోసం మా ర్చి నెల నుండే టెండర్లను పిలిచి మే నెలాఖరు వరకు పూర్తి చేసేవారు. జూన్ నుంచి ఆగస్టు లోపు సీడ్ కూడా పంపిణీ జరిగి చెరువుల్లో వదిలేవారు. ప్రస్తుతం సెప్టెంబర్ మాసం వచ్చినా చర్యలు లేవు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకోవాలి. **- సూరి, మత్స్యకార సంఘం నాయకుడు.**

# రైతన్నల పైనే వడ్డీ భారం

**కట్ చేసిన పది శాతానికి వడ్డీ చెల్లించని సహకార సంఘం**

- ఖానాపూర్ సంఘంలో 916 మంది రైతులకు రూ.7.46 కోట్ల రుణం
- రూ.74 లక్షల షేర్ క్యాపిటల్‌పై అన్నదాతకు అందని వడ్డీ ఫలాలు
- కట్ చేసిన షేర్ క్యాపిటల్‌పై వడ్డీ మాఫీ చేయాలంటున్న అన్నదాతలు
- పీఏసీఎస్‌లో పంట రుణం తీసుకుంటే.. పది శాతం షేర్ క్యాపిటల్ పేరిట బ్యాంక్‌లోనే జమ


ఖానాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

ఖానాపూర్ టౌన్, సెప్టెంబర్ 11 ః ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పంట రుణాలు తీసుకునే రైతులు తాము పొందిన రుణం నుంచి షేర్ క్యాపిటల్ పేరిట పది శాతం నిధులను చెల్లించాలి. ఈ నిధులను రైతు పూర్తిగా తన ఖాతాను క్లోజ్ చేసినపుడు తిరిగి బ్యాంకు సదరు రైతుకు చెల్లిస్తుంది. అప్పటి వరకు షేర్ క్యాపిటల్ రూపంలో బ్యాంకులోనే నిల్వ ఉంటాయి. షేర్ క్యాపిటల్ డబ్బుపై వచ్చిన వడ్డీని బ్యాంకు అభివృద్ధి, బ్యాంక్ సంబంధిత లావాదేవీల కోసం ఉపయోగిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ.. బ్యాంకు నుండి రుణం పొందిన రైతుకు మాత్రం పూర్తి రుణంపై వడ్డీ పడుతుందని చెబుతున్నారు. కట్ చేసిన షేర్ క్యాపిటల్ డబ్బుకు వడ్డీ పడుతుండడంతో ఉత్తి పుణ్యానికే రైతు వడ్డీ భారాన్ని మోయాల్సి వస్తోందని చెబుతున్నారు. కట్ చేసిన షేర్ క్యాపిటల్ నిధులకు తమ నుండి వడ్డీ వసూలు చేస్తున్న బ్యాంకు అధికారులు తిరిగి తమ డబ్బులకు మాత్రం వడ్డీ చెల్లించకపోవడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రూ.74 లక్షలు షేర్ క్యాపిటల్‌కు మళ్లింపు

ఖానాపూర్ పీఏసీఎస్‌లో గతేడాది డిసెంబర్ 9 వరకు 916 మంది రైతులు పంట రుణాలను పొందినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ రైతులకు రూ.7.46 కోట్లకు పైగా నిధులను పంట రుణం రూపంలో ఇచ్చినట్లు బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ఈ రుణం నుంచి షేర్ క్యాపిటల్ కు పది శాతం అనగా రూ.74 లక్షలను మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఈ రూ.74 లక్షలపై రైతుల నుంచి క్రాప్ లోన్ ద్వారా వడ్డీ వసూలు చేస్తున్న అధికారులు తిరిగి వారి నుండి స్వీకరించిన షేర్ క్యాపిటల్‌కు మాత్రం వడ్డీని చెల్లించడం లేదని చెబుతున్నారు. ఇదేమని అడిగితే తమ నిబంధనలు ఇలాగే ఉన్నాయని సెలవిస్తున్నారు. క్రాప్ లోన్ పొందిన రైతు నిర్ణీత యేడాదిలోపు చెల్లిస్తే అతనికి పడే 7 శాతం వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం, కేంద్ర ప్రభుత్వం 3 శాతం భరించాల్సి ఉందని చెబుతున్నారు. కానీ.. కేంద్ర ప్రభుత్వం మాత్రమే సకాలంలో చెల్లించిన రైతుల ఖాతాల్లో 3 శాతం వడ్డీ ఫలాలను తిరిగి జమ చేస్తున్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం నిధులను జమ చేయడం లేదని చెబుతున్నారు. ఇలా ఓ వైపు ప్రభుత్వాలు వడ్డీ ఫలాలను ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం, మరో వైపు షేర్ క్యాపిటల్ పేరిట కట్ చేసిన నిధులపై వడ్డీ వసూలు చేస్తుండడంతో రైతన్నపై వడ్డీ భారం అధికమౌతున్నది. వెంటనే ఈ భారాన్ని తగ్గించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### నిబంధనల మేరకే షేర్ క్యాపిటల్‌ను కట్ చేస్తున్నాం..



*వ్యవసాయ సహకార సంఘం నిబంధనల ప్రకారమే క్రాప్ లోన్‌లు తీసుకున్న ప్రతి రైతు నుంచి షేర్ క్యాపిటల్‌ను 10 శాతం కట్ చేస్తున్నాం. ఇందులో పది శాతం నిధులను జిల్లా సహకార బ్యాంక్‌లో ఉంచి, మిగతా 90 శాతం నిధులను సొసైటీకి ఇస్తున్నారు. రైతు పూర్తి స్థాయిలో తన రుణాన్ని చెల్లించి ఖాతాను ముగించిన సమయంలో వారికి ఈ షేర్ క్యాపిటల్ నిధులను తిరిగి చెల్లించడం జరుగుతుంది.*

**- భూమి ఆశన్న, సీఈవో, పీఏసీఎస్, ఖానాపూర్.**

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు
- ఆదివాసీ గిరిజన పెద్దల సమావేశంలో ఎస్పీ గౌష్ ఆలం


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 11 : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గౌష్ ఆలం హెచ్చరించారు. బుధవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని ఎస్పీ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగోబా దర్బార్ హాల్‌లో ఆదివాసీ గిరిజన పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధితురాలికి రూ. ఒక లక్ష పరిహారం అందించినట్లు తెలిపారు. సోషల్ మీడియాపై పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ సమన్వయ కర్త సిడాం భీంరావ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, వడగాం సార్‌మేడి మెస్రం చిన్నుపటేల్, గిన్నేరా సార్‌మేడి తుంరం జుగాదిరావ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ మొగిలి, ఎస్ఐ దుబ్బాక సునీల్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్, మాజీ ఎంపీపీ కనక తుకారాం, ఆదివాసీ ప్రధాన్ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు ఆర్కా ఖమ్ము, పిట్టబొంగురం పటేల్ వెట్టి రాజేశ్వర్ పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ అభివృద్ధికి చర్యలు

### డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి


గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి

ఎదులాపురం, సెప్టెంబర్ 11 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎన్‌సీసీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 32వ బెటాలియన్ ఎన్‌సీసీ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. జిల్లాలో పనిచేస్తున్న ఎన్‌సీసీ బృందాల సంఖ్య, వారికి అందిస్తున్న శిక్షణల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ విభాగాలు, రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు ఎన్‌సీసీ అధికారులు, కేడెట్లు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌సీసీ బెటాలియన్ పటిష్టత కోసం ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఏడీ కల్నల్ సంజయ్ గుప్తా, గ్రూప్ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం, నిజామాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ ట్రెయినింగ్ ఆఫీసర్ కల్నల్ కౌస్తవ్ మహంతి, బెటాలియన్ అధికారి వికాస్ పాల్గొన్నారు.